# భయం

– రోహిణీసత్య

''అమ్మా! ఈరోజు స్కూలుకెళ్ళనే'' అమ్మ ఏమంటుందోనన్న భయంతోనే బితుకు బితుకు మంటూ చెప్పింది సుధ. ఇది ఆరోసారి సుధ అలా అనడం.

''చూడు నన్ను విసిగించకు. లాయరుగారింటికి ఈరోజు చుట్టాలు వస్తున్నారు. త్వరగా వెళ్ళి వంటచెయ్యాలి. అయినా ఫీజు కట్టలేదనేగా స్కూలుకెళ్ళడానికి భయం, ఈ ఒక్కరోజుకు మీ 'మిస్'ని పర్మిషన్ అడుగు. లాయరుగారింట్లో పనైపోయినతర్వాత వచ్చి ఫీజు కడతాను'' అంటూ చేతిసంచి తీసుకుంది.

ఇంకా అలానే నుంచున్న సుధను చూసి కోపం ముంచుకొచ్చింది రమకు. ''చూడు నిన్నొక్కతినే ఇంట్లో వదలటం కుదరదు. అలాగని వారింటికి తీసుకెళ్ళడం బావుండదు. ఈరోజు నీవు స్కూల్‌కు వెళ్ళితీరాలి'' అంటూ ఇంకోమాటకు తావివ్వక ఇల్లు అనబడే ఆ గదికి తాళం వేసింది.

తన చిన్ని మనసుతో అంతదాకా ఆలోచించిన సుధ చివరకు బ్యాగు భుజాన వేసుకుని బరువుగా అడుగులేస్తూ అమ్మవెంట స్కూలుకు బయలుదేరింది. స్కూలు మలుపులో సుధను దింపి ముందుకు కదిలింది రమ.

అడుగులేస్తున్న రమ మనసంతా సుధపైనే. తను మాత్రం ఏం చేయగలదు. ఎంత కష్టపడ్డా డబ్బుకెప్పుడూ కటకటే. భర్తకున్న ఉద్యోగం పోయింది. ఇంకో పనికెళ్ళాలనే ధ్యాసే లేదు. అతగాడి యావంతా పేకాటలో లక్షలు సంపాదించాలని. తన సంపాదన కూడా ఆ ఆటలో తగలేస్తాడు. ఇవ్వకపోతే గొడ్డును బాదినట్టు బాదుతాడు.

పాపం సుధ ఎన్నిరోజులనుండీ ఫీజు అడుగుతోంది. ఎలాగో సర్దుదామంటే కుదరడంలేదు. తన సంపాదన అంతంతమాత్రమే. ఏదో ఆ ఇంట్లో ఈ ఇంట్లో వంటపని చేయబట్టి రెండుపూటలా కడుపు కింత గడిచిపోతోంది. ఇక బట్టలు సరేసరి. సుధ కూడా ఒక్క యూనిఫామ్‌తోనే నెట్టుకొస్తోంది. అయినా ఇవన్నీ తాము సర్దుకున్నా ఫీజు విషయంగా స్కూలు వాళ్ళు సర్దుకోవాలిగా. తనకేమో అది బాగా చదివి మంచి పన్లో చేరాలని ఆశ. అంచేతనే కష్టపడి ఇంటికి దగ్గర్లోని 'కాన్వెంట్' స్కూల్లో చేర్పించింది. బలవంతంగా స్కూలుకు పంపింది. మిస్ పనిష్మెంటు ఇస్తారేమో. లాయరుగారిల్లు దగ్గరవడంతో రమ ఆలోచనలు తెగాయి.

సుధ స్కూలు ప్రొద్దుటే అవటం మూలాన మధ్యాహ్నానికల్లా వదిలేస్తారు. రెండిళ్ళలో వంట ముగించుకుని, మిగిలిన కూరలను సంచిలో సర్దుకుని ఫీజు డబ్బులతో స్కూలుకు బయలుదేరింది రమ.

ఫీజు కట్టి గేటుదగ్గర నిల్చున్న రమను భయాందోళనలు చుట్టుముట్టాయి. పిల్లలందరూ వెళ్ళిపోయారు. సుధ రాలేదు. ఆయానడిగింది. క్లాస్‌టీచర్‌నడిగింది. ఇద్దరు సుధ స్కూలుకి రాలేదన్నారు. ఒకవేళ తను ఫీజ్ కట్టేటప్పుడు ఇంటికి వెళ్ళిపోయిందేమోనని ఇంటివేపు నడిచింది. ఇంట్లోలేదు. అలా ఎప్పుడూ ఒక్కతే రాలేదు. పక్కింట్లో, ఎదురింట్లో, చుట్టుపక్కల వెదకని చోటులేదు. చివరకు పోలీసులకు కంప్లైంట్ ఇచ్చింది పక్కింటివారి సాయంతో.

కన్నీళ్ళు కాలువలు కడుతున్నాయి. రాత్రయినా సుధ జాడలేదు. ఎక్కడ పేకాడుతున్నాడో తెలియదు రమ భర్త రామం జాడకూడా లేదు. రాత్రంతా గోడకానుకుని నీళ్ళన్ని ఇంకిపోయేలా ఏడుస్తునేవుంది రమ.

తెల్లవారింది. తలుపుతట్టిన చప్పుడు. సుధ వచ్చిందేమో ఆతృతగా, ఆశగా తలుపు తెరిచిన రమకు స్కూలు ఆయా కన్పించింది.

''సుధ కన్పించిందా?'' ఆత్రంగా ప్రశ్నిస్తున్న రమను చూసి ఆయా కళ్ళల్లో నీళ్ళు. ''పాప హాస్పిటల్లో వుంది. మీరు నాతోబాటు రండి'' అంటూ మరో మాటకు తావివ్వక రమను లాక్కుపోయింది.

వార్డుముందు గుంపులుగా జనం. మనసు కీడుని శంకించింది. అందర్ని తోసుకుని ముందుకు పోయిన రమ సుధని చూసి కుప్పకూలింది. తలకట్టుతో అచేతనంగా పడివుంది సుధ.

జనం తలోకమాట అంటున్నారు. ''పాపం రాత్రంతా స్కూల్లోనే వుందట.''

''అసలు ఈ అమ్మాయి స్కూలుకే రాలేదంటున్నారు టీచర్.''



''మరెలా స్పోర్ట్స్‌రూమ్‌లో స్పృహ తప్పి పడివుందో.'' ''తలకు పెద్ద దెబ్బ తగిలిందట'' తలోకమాట అంటున్నారు.

అది జరిగింది ఇలా–

నిన్నటి టీచర్ వార్నింగ్ గుర్తొచ్చి ఎవరికంటా పడక ఎక్కడయినా నక్కి బెల్ కొట్టాక ఇంటికెళ్ళాలని కనపడిన రూమ్‌లో నక్కింది సుధ. అది స్పోర్ట్స్ రూమ్.

రాత్రంతా ఫీజు ధ్యాసవల్ల సరిగ్గా నిద్రపట్టకపోవడంతో జోగుతూ చివరకు ఆ మూల్లోనే నిద్రకొరిగింది. గాఢ నిద్రలో లాస్ట్‌బెల్ సుధ చెవినపడలేదు.

స్కూల్ అవర్స్ అయ్యాక వాచ్‌మన్ అన్నిగదుల్లోకి అతి మామూలుగా తొంగిచూసి తాళం వేసుకుపోయాడు. పాత ఆట సామానుల వెనగ్గా దాగి గాఢంగా నిద్రపోతున్న సుధ అతడి కంటపడలేదు.

సడన్‌గా మెలకువొచ్చి కళ్ళు తెరిచిన సుధకు భయమేసింది. కారణం నిశ్శబ్దంగా వున్న వాతావరణం. తలుపులు మూసివున్నాయి. స్కూల్ వదిలి ఎంతసేపయిందో! పరిగెట్టి తలుపులు లాగింది. తెరుచుకోలేదు.

చిన్నగా మొదలయిన భయం వటవృక్షంలా పెరిగిపోసాగింది. ఎంతగా అరిచినా ఎవరికీ వినబడదు. ఒకవేపు ఆకలి, ఇంకోవేపు భయం, దుఃఖం.

చీకటిపడింది. వెలుతురుండగానే స్విచ్ నొక్కాలని కూడా తెలియని పసివయసు, చీకట్లో అడుగు కదపాలంటే భయం. వినకూడదనుకుంటూనే పక్కింటి వనజవద్ద విన్న దయ్యం కథ గుర్తొస్తోంది సుధకు.

''అమ్మా!'' బిగ్గరగా కేకపెట్టింది. ఏవో నీడలు తన వేపు వస్తున్నట్టు– సుధ భయంతో పెద్దగా కేకవేసి క్రిందపడిపోయింది. తలకు డంబుల్స్ తగిలి గాయం. రక్తం కారసాగింది.

జరిగిన ఘటనకు బాధ్యులెవరు? రేపైనా ఫీజు తేవాలని కాస్త స్ట్రిక్ట్‌గా వార్నింగ్ ఇచ్చిన టీచర్‌దా! కాదేమో, ఆమె తన డ్యూటీ తను చేసింది.

తన తాహతుకు మించి కాన్వెంట్‌లో చేర్చి సరిగ్గా ఫీజుకట్టని రమదా తప్పు? కాస్త వుండవచ్చునేమో! కాని లోతుగా చూస్తే తప్పు మన విద్యావ్యవస్థ, సామాజిక వ్యవస్థలోనే వుందనిపిస్తుంది. కాన్వెంట్‌లో చదివితేనే చదువు కార్పొరేషన్ స్కూల్లో కాదు అన్న భావన అందరిలో పాతుకుపోయింది.

ఆశ మనిషికి సహజం. కాని ఆకాశాన్నంటిన ఆశల కొమ్మలను అందరూ అందలేరుగా. రమ ప్రయత్నం అలాంటిదే. అందుకే రమ తన తప్పుని తాను తెలుసుకొంది.

ఫీజు సరిగ్గా కట్టని తన తప్పుకు సుధ బలికాకూడదు. సుధని ఆ స్కూలు మాన్పించి దగ్గర్లోవున్న గవర్నమెంట్ స్కూల్లో చేర్పించాలి. ఆ చిన్నిమనసు నిర్భయంగా, స్వేచ్ఛగా తన పరిధిలో తను చదువుకుంటే చాలు. సుధ త్వరగా కోలుకునేలా చేయి భగవంతుడా! అంటూ కన్నీళ్ళతో భగవంతుడ్ని ప్రార్థించింది. ఆ దేవుడికి మొర విన్పించిందేమో సుధ కాస్త కదిలింది.

★